కాంగ్రెస్ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

మేడ్చల్ కలెక్టర్‌కు ఆ పార్టీ నేతల వినతి



స్థలం కావాలని మేడ్చల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

ఓల్డుబోయినపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పదేండ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్ నియోజక వర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలతో కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, కూన శ్రీశైలంగౌడ్, కొలను హన్మంత్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

భాగ్యరెడ్డివర్మను ప్రజలెవరూ మరువరు

- అంబేడ్కర్ యువజన సంఘం



మాదరి భాగ్యరెడ్డివర్మకు నివాళులర్పిస్తున్న కర్కపెంటయ్య, నాగరాజు తదితరులు

ఫతేనగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): దళిత సమాజానికి ఎనలేని కృషి చేసిన మాదరి భాగ్యరెడ్డి వర్మను ప్రజలెవరూ మరచిపోరని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నేతలు అన్నారు. భాగ్యరెడ్డి వర్మ 137వ జయంతి సందర్భంగా గూడ్స్ షెడ్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం గ్రేటర్ అధ్యక్షుడు కర్కనాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కర్కపెంటయ్య, కర్కస్వామి, శివరాజ్‌యాదవ్, గురజాలరాజు, కర్కమహేష్, స్థానిక నాయకులు అంబేడ్కర్ అమరజ్యోతి సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఏసీపీగా గిరిప్రసాద్ బాధ్యతల స్వీకరణ



ట్రాఫిక్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన గిరిప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ట్రాఫిక్ సీఐ సురేశ్‌కుమార్

బాలానగర్, మే 22(ఆంధ్రజ్యోతి): బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీగా గురువారం గిరిప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. 5 నెలలుగా బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ సీటు ఖాళీగా ఉండడంలో మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ ఇన్‌చార్జి ఏసీపీగా బాధ్యతలు నిర్వహించారు. రెండు రోజుల క్రితం చేపట్టిన ఏసీపీల బదిలీలలో ఇంటలిజెన్స్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.గిరి ప్రసాద్ ఏసీపీగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఏసీపీని బాలానగర్ ట్రాఫిక్ సీఐ సురేశ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

జేఎన్‌టీయూ వద్ద ఫ్రీలెఫ్ట్ పనుల పరిశీలన



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న సీపీ అవినాష్ మహంతి

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీ జేఎన్‌టీయూ వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి గురువారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు, కరెంటు స్తంభాల తరలింపును త్వరితగతిన పూర్తిచేయాల్సిందిగా కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులకు ఆయన సూచించారు. జేఎన్‌టీయూ మూలమలుపు వద్ద ఎన్నో ఏళ్లుగా ఫ్రీలెఫ్ట్ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. దీన్ని పరిష్కరించేందుకు జేఎన్‌యూ గోడను లోపలకు నిర్మించి, మరమ్మతులు పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఏపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు అందజేత



లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పత్రం అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న అప్సారీ శ్రీలక్ష్మి న్యూరాలజీ సమస్యతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్‌లో చేరి చికిత్స తీసుకుంది. అనంతరం ఆస్పత్రి బిల్లుల పరిహారార్థం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ఆమెకు మంజూరైన లక్ష రూపాయలకు సంబంధించిన పత్రాలను గురువారం నియోజకర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సైబరాబాద్‌లో ఆరుగురు అదనపు డీసీపీల బదిలీ

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు అదనపు డీసీపీలు బదిలీ అయ్యారు. మాదాపూర్ అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేస్తున్న ఎస్.జయరాం టీజీఐసీసీసీలో అడిషనల్ ఎస్పీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో కొత్తగా పదోన్నతిపై ఎస్.ఉదయ్ రెడ్డి వచ్చారు. మేడ్చల్ ఎస్‌బీ విభాగం అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న మహ్మద్ ఫజ్లుర్ రహమాన్ హైదరాబాద్ సీఐడీ విభాగం అడిషనల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ అడిషనల్ డీసీపీగా ఎ.విశ్వప్రసాద్ రాగా, శంషాబాద్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై కె.పూర్ణచందర్, సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై జి.హనుమంతరావు, రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై కొమ్మెర శ్రీనివాస రావును నియమిస్తూ హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

శివార్లలో గుప్పుమంటున్న గంజాయి..!



- పోలీస్ స్టేషన్లలో పెరుగుతున్న కేసులు
- పొరుగు రాష్ట్రాల నుంచి పార్సిళ్ల రూపంలో రవాణా
- చిన్న ప్యాకెట్లు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న కేటుగాళ్లు

బాలానగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు చాపకింద నీరులా వ్యాపిస్తున్నాయి. అక్రమ వ్యాపారానికి అలవాటు పడిన కొందరు గుట్టు చప్పుడు కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి రవాణా చేసుకుని వాటిని నగరంలోని వ్యాపారులకు (డిస్ట్రిబ్యూటర్లకు) అందజేస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్లు ఏరియాల వారీగా తమకు నమ్మకస్తులైన వారిచే గంజాయిని 5 నుంచి 10 గ్రా. ఉన్న చిన్న చిన్న ప్యాకెట్లలో కావలసిన వారికి విక్రయిస్తున్నారు. కళాశాలలు, విద్యాసంస్థలు మాస్ పబ్లిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, స్విగ్గీ బాయిస్‌లా ఎవరికీ అనుమానం రాకుండా బైకుపై వెళ్లి గంజాయి అవసరం ఉన్న వారికి అందజేస్తున్నట్లు తెలుస్తోంది. బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌తో పాటు కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, బాచుపల్లి, సనత్‌నగర్, సూరారం, పేట్‌బషీరాబాద్, జీడిమెట్ల, గచ్చిబౌలీ పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుసగా నమోదవుతున్న గంజాయి కేసులను బట్టి వ్యాపారం ఎంత జోరుగా సాగుతుందో చెప్పవచ్చు.

పార్సిళ్ల రూపంలో రవాణా

గంజాయి కేసులో పట్టు బడ్డ వారు చెబుతున్న వివరాల ప్రకారం సరుకు ఎక్కడి నుంచి రవాణా అవుతుందో తెలియదని ఒక వ్యక్తి పలానా చోట ఇచ్చాడని అంతకు మించి తమకేమీ తెలియదని చెప్పడంతో పోలీసులకు ఏం చేయాలో అంతుచిక్కడం లేదు. కరడు గట్టిన గంజాయి వ్యాపారులు పోలీసులకు ఎలాంటి అనుమానం రాకుండా బీహార్, ఒరిస్సా, తమిళనాడు, ఆంధ్రా ప్రాంతాల నుంచి అనుమానం రాకుండా ఆర్టీసీ, ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు ఏజెన్సీల ద్వార పార్సిళ్లలో నగరానికి చేరవేస్తున్నటుగా సమాచారం. అక్కడి నుంచి ఎవరికీ అనుమానం రాకుండా కార్లు, బైకులు, ఆర్టీసీ బస్సుల్లో శివారు ప్రాంతాలకు చేరుకుని ఫోన్ నంబర్ల ద్వారా మిగతా వ్యాపారులకు కట్టబెడుతున్నట్లు తెలుస్తోంది. మరి కొందరు పెద్ద మొత్తంలో డబ్బులు ఆశ జూపి యువకులను, యూత్ నాయకులను బినామీలుగా మార్చుకుని ఈ దందాకు వినియోగించుకున్నట్లు సమాచారం.



ఇటీవల గంజాయిని విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఎస్‌వోటీ పోలీసులు (ఫైల్)



పెరుగుతున్న గంజాయి కేసులు

గత ఏడాది 2024లో బాలానగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 51 ఎక్సైజ్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఎక్సైజ్ పోలీసులు 83 మందిని అరెస్టు చేసి వారి వద్దనుంచి 45.99 కిలోల గంజాయి, 128.5 గ్రా. హాషిష్ ఆయిల్, 53.1.గ్రా. ఎండిఎంఏ (మిథలినీ డయాక్సీ -మెథం పెటామిన్ లేదా మోలీ)ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. తాజాగా 2025 జనవరి 1 నుంచి మే 19 వరకు మొత్తం 28 కేసులు నమోదయ్యాయి. పట్టుబడిన 49 మంది నిందితుల నుంచి 151.2 కిలోల గంజాయి, 10 గ్రా. హాషిష్ ఆయిల్, 79 గ్రా. ఎండిఎంను స్వాధీనం చేసుకు వారిని రిమాండ్‌కు తరలించారు. అంటే గత ఏడాది మొత్తం 51 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 5 నెలల్లో 28 కేసులు నమోదయ్యాయి.



మార్కెట్లో గంజాయి చాక్లెట్లు

మత్తును మరో మార్గంలో విక్రయిస్తూ గంజాయి వ్యాపారులు పోలీసులకు సవాలు విసురుతున్నారు. గంజాయిని చాక్లెట్ల రూపంలో పాన్‌షాపుల్లో అందుబాటులో ఉంచి ఎవరికీ అనుమానం రాకుండా కావలసిన వారికి విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టినప్పటికి, పక్కా సమాచారంతో ఎస్‌వోటీ పోలీసులు దాడులు చేసి గంజాయి, గంజాయి చాకెట్లు విక్రయిస్తున్న వారిని పట్టుకుని వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం పరిపాటిగా మారింది.

అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నాం



గంజాయి అమ్మకాలు జరుగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. గంజాయిని సేవిస్తే వచ్చే నష్టాలపై యువత కు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గంజాయి, దానికి సంబంధించిన మత్తు పదార్థాలు ఎక్కడైనా విక్రయిస్తున్నారో తెలుసుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అమ్మినా.. సేవించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రస్తున్నట్లు గానీ, సేవిస్తున్నట్లు గాని తెలిస్తే 8712658739 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వండి.

- డి.వేణుకుమార్, సీఐ, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, బాలానగర్

ప్రత్యేక చట్టాలు తేవాలి



నగరంలో విస్తరిస్తున్న గంజాయి, డ్రగ్స్ కల్చర్‌ను అరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. విద్యాసంస్థలు, పబ్‌లు, బార్లు, రెస్టారెంట్ల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేసి విక్రయిస్తున్న వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.

- కృష్ణగౌడ్, మాజీ కార్పొరేటర్, ఫతేనగర్

ప్రజలు ఏదడిగినా నెరవేర్చేందుకు సిద్ధం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రజలు ఏదడిగినా నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్ విలేజ్‌లో ఉన్న అతి పురాతన వీరాంజనేయ స్వామి ఆలయాన్ని తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తానన్న హామీ మేరకు గురువారం ఆలయ ప్రహరీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎంతో మహిమ కల్గిన ఆంజనేయ ఆలయం దుస్థితిని చూస్తే బాధేసిందన్నారు. భగవంతుడు ఇచ్చిన శక్తి మేరకు ఆలయ అభివృద్ధి, ధ్వజ స్తంభం ఏర్పాటు, ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఊళ్లల్లో దేవాలయాలు బాగుంటేనే ఆ ఊర్లు సుభిక్షంగా ఉంటాయని, ప్రజలు కూడా సుఖశాంతులతో ఉంటారని పేర్కొన్నారు. పురాతన ఆంజనేయ స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రజలతో పాటు తనకు అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్

ఘనంగా హనుమాన్ జయంతి

బాలానగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మియాపూర్ మదీనగూడాలో నిర్వహించిన వేడుకల్లో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొన్నారు. స్వామి వారికి లక్ష తమల పాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం నిర్వాహకులు బండి రమేష్‌ను పట్టు వస్త్రాలతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



కూకట్‌పల్లి దాసాంజనేయ దేవాలయంలో పూజల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, మే 22(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి గ్రామం, శ్రీ సీతారామస్వామి అనుబంధ దేవాలయం దాసాంజనేయ దేవాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం హనుమాన్ జయంతి పురస్కరించుకుని నియోజవర్గపరిధిలో పలు హనుమాన్ ఆలయాల్లో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ప్రజలందరు ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. సీతారామాలయంలో త్వరలోనే 20 అడుగుల ఆంజనేయ, గరుత్మంతుడి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ పూజలలో ఆలయ మాజీ చైర్మన్ తులసీరావు, కూకట్‌పల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

గందరగోళంగా సొసైటీ ఎన్నికల నిర్వహణ

- 28న మోతీనగర్‌లో కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు
- అర్హత, అనర్హతలపై జిల్లా రిజిస్ట్రారు, ట్రిబ్యునళ్ల దాకా చేరిన వ్యవహారం
- ఎన్నికల నిర్వహణలో నిబంధనలు అనుసరించాలంటూ ఓ వర్గం పట్టు

అల్లాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): మూసాపేట డివిజన్ పరిధిలోని మోతీనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి ఈ నెల 28న ఎన్నికలు జరగనున్నాయని సొసైటీ సభ్య ప్రతినిధి తెలిపారు. 407 సభ్యులు గల ఈ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి ప్రాతినిధ్యం వహించేందుకు, నామినేషన్ల పర్వం ముగిసే నాటికి 25 మంది కార్యవర్గ సభ్యులు బరిలో నిలిచినట్టు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రెండు రోజులుగా మోతీనగర్ కమ్యూనిటీ హాల్లో ఎన్నికల వాతావరణం రసాభాసగా మారింది. గతంలో నిర్వహించిన కార్యవర్గం సొసైటీ సభ్యులకు ఇవ్వదలచిన బహుమతుల తాలూకు సొసైటీకి కొంత రుసుం చెల్లించాలని, విషయం కో- ఆపరేటివ్ సొసైటీల డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ దగ్గరకు, తదనంతరం ట్రిబ్యునల్‌కు వెళ్లింది. ట్రిబ్యునల్ ఆదేశాల అనంతరం రూ.3 లక్షల పై చిలుకు సొసైటీకి చెల్లించామని, తమకన్నా ముందు కార్యవర్గాన్ని నిర్వహించిన వారు ఈ బహుమతుల ట్రెండ్ మొదలు పెట్టారని, ఆయా వర్గం కూడా సొసైటీకి రూ.4 లక్షల పైచిలుకు చెల్లించాల్సి ఉందని అంజిరెడ్డి వర్గం ఆరోపిస్తోంది. ఇలా పేర్కొంటూ అంజిరెడ్డి వర్గం ఎన్నికల బరిలో నిలవగా, చెల్లించిన రుసుం చెల్లించాల్సిన దాంట్లో వడ్డీ వరకే సరిపోయిందని, కో-ఆపరేటివ్ సొసైటీ రూల్స్ ప్రకారం ఆయా వర్గంలోని కొందరు సభ్యులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులే కాదంటూ ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎన్నికల అధికారికి లేఖ రాసి ఇవ్వగా పరిశీలన నిమిత్తం దానిని పైఅధికారులకు పంపినట్టు ఎన్నికల అధికారి తెలిపారు. ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుకు అనుగుణంగానే తాము ఎన్నికలు నిర్వహిస్తున్నామంటూ ఎన్నికల అధికారి వివరించగా, ట్రిబ్యునల్ కూడా కేసును రిమాండ్ చేసిందని, ఎన్నికల్లో పోటీకి అర్హత పరిశీలించాల్సిన అంశం ఎన్నికల అధికారి పరిధిలోనిదని, కో-ఆపరేటివ్ సొసైటీ నిబంధనల ప్రకారం కొందరు పోటీకి అనర్హులని వివరిస్తూ ఎన్నికల అధికారికి మొదటి వర్గం లేఖలో పేర్కొన్నారు, అయినప్పటికీ ట్రిబ్యునల్ ఉత్తర్వులకు అనుగుణంగానే అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉండేలా చూశామని ఎన్నికల అధికారి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.

ఫోన్ దొంగల అరెస్ట్

మియాపూర్, మే22 (ఆంధ్రజ్యోతి): ఒంటరి వ్యక్తులపై దాడి చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంకు చెందిన ప్రదీప్ (38)మల్లాపూర్‌లో నివాసం ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో జీఎస్‌ఎం మాల్ ముందు క్యాబ్ ఆపి ఫోన్ చేస్తున్నాడు. ఈ క్రమంలో షాబాజ్, సోహెల్ అనే ఇద్దరు కారులో ఉన్న ప్రదీప్ వద్దకు వచ్చి అతని వద్ద ఉన్న ఫోన్‌ను లాక్కుపోయారు. ఈ క్రమంలో ఘర్షణ జరిగి ప్రదీప్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిగిప ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చందానగర్, రాయదుర్గం ఫిలింనగర్, పోలీస్ స్టేషన్లలో వారిపై పలు దొంగతనాల కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ



ఎల్లమ్మబండలో విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, గౌడ సంఘం నాయకులు

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో గురువారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, రాష్ట్ర గౌడసంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్, కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ నార్నె శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



జలవాయు విహార్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ జలవాయువిహార్ కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం స్థానికంగా పర్యటించి కాలనీలో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నాణ్యత లేని నిర్మాణాలు..
కుంగుతున్న మ్యాన్‌హోళ్లు

- ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్రవాహనదారులు



గాయత్రినగర్ లోని మలుపు వద్ద కుంగిన మ్యాన్‌హోల్

అల్లాపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్‌లో పలు చోట్ల మ్యాన్‌హోళ్లు కుంగిపోయి ప్రమాదకరంగా తయారయ్యాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, నాణ్యత లేని పనుల కారణంగా నిర్మించిన కొన్ని రోజులకే మ్యాన్‌హోళ్ల రోడ్డులోకి కుంగిపోవడంతో ఆ మార్గంలో వెళ్లే ద్విచక్ర వాహనదారుల నడ్డి విరుగుతోందని స్థానికులు అంటున్నారు. దీనికి అల్లాపూర్ ప్రధాన రహదారి నుంచి గాయత్రినగర్ రోడ్ నెం.11-సి మలుపు వద్ద కుంగిన మ్యాన్‌హోల్ నిదర్శనమని వారు అంటున్నారు. ద్విచక్రవాహనంపై వేగంగా వస్తున్న వాహనదారులు కుంగిన మ్యాన్‌హోల్‌ను చూసి ఒక్కసారిగా బ్రేక్ వేస్తున్నారని, దీంతో అదుపుతప్పి పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రజల నుంచి పలు రకాల ట్యాక్స్‌లు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు ప్రజలకు కనీస అవసరాలను సమకూర్చడంలో విఫలమవుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించేటప్పుడు వారు నిర్మించిన మ్యాన్‌హోళ్లకు ఓ నిర్ణీత గడువు వరకు వారంటీ ఉండే విధంగా అధికారులు నిబంధన పెడితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా అధికారులు మ్యాన్‌హోళ్ల నాణ్యతతో నిర్మించేలా చూడాలని, అలాగే, గాయత్రినగర్ రోడ్ నెం.11-సి మలుపు వద్ద కుంగిన మ్యాన్‌హోల్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

శుభాకాంక్షలు



పేట్‌బషీరాబాద్ ఏసీపీగా బాలగంగారెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ఇక్కడి నుంచి బదిలీపై వెళ్తున్న ఏసీపీ రాములు మొక్కను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు.

(పేట్‌బషీరాబాద్, ఆంధ్రజ్యోతి)



కలెక్టర్ గౌతమ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న హరివర్ధన్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్ కార్యాలయానికి స్థలం కేటాయించండి

- కలెక్టర్‌కు పార్టీ జిల్లా అధ్యక్షుడి వినతి

దుండిగల్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కుమార్ కు జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లాలో ఎక్కడో ఒక్కచోట కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే ఎంసుధీర్‌రెడ్డి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలు తోటకూర వ్రజేష్‌యాదవ్, కొలన్ హన్మంత్‌రెడ్డి, బండి రమేష్, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, తూముకుంట మున్సిపల్ అధ్యక్షుడు బి.జయపాల్‌రెడ్డి ఉన్నారు.



డీటీ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

అక్రమ వాటర్ ప్లాంట్లను బంద్ చేయించాలి

- మగ్దూంనగర్, భగత్‌సింగ్ మార్క్స్ బస్తీవాసుల వినతి

పేట్‌బషీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో అక్రమంగా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లను వెంటనే బంద్ చేయాలని జగద్గిరిగుట్ట డివిజన్‌లోని మగ్దూంనగర్, భగత్‌సింగ్ మార్క్స్ బస్తీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయా బస్తీల్లోని వాటర్ ప్లాంట్ల వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం కుత్బుల్లాపూర్ మండలం డీటీ మల్లికార్జున్‌కు కలిసి బస్తీల్లోని అక్రమ వాటర్ ప్లాంట్లను బంద్ చేయించాలని వినతి పత్రం అందజేశారు. అక్రమంగా వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి బోర్ల నుంచి నీటిని తోడి రాత్రింబవళ్లు ఇష్టానుసారంగా నీటి వ్యాపారం చేస్తున్నారని, దీంతో తమ ఇళ్లలోని బోర్లు అడుగంటిపోతున్నాయని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈప్లాంట్లను గతంలో రెవెన్యూ అధికారులు మూసి వేయించినా మళ్లీ వాటిని నడిపిస్తున్నారని వారు ఆరోపించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అక్రమ వాటర్ ప్లాంట్లను బంద్ చేయించాలని బస్తీవాసులు కోరుతున్నారు.



స్విగ్గీ వేర్‌హౌస్ సిబ్బందికి ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ నాగరాజు

ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత

పేట్‌బషీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు అన్నారు. పేట్‌బషీరాబాద్ దేవరాంజల్‌లోని స్విగ్గీ వేర్‌హౌస్ సిబ్బంది, ఉద్యోగస్తులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. రోడ్డు ప్రమాదాలు, వాహనదారులు పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలను వారికి వివరించారు. ద్విచక్ర వాహనదారులు రాంగ్‌సైడ్ డ్రైవింగ్, త్రిబుల్‌రైడింగ్ చేస్తుంటే ఫొటోలు తీసి సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల వాట్సాప్ నెంబర్ 9490617346కు పంపించాలని కోరారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సీఐ నాగరాజు సూచించారు.



జగద్గిరిగుట్టలో నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలి: సీపీఐ

జీడిమెట్ల, మే 22 (ఆంధ్రజ్యోతి): శాంతి చర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు నాలుగుసార్లు ప్రభుత్వానికి చెప్పినప్పటికీ, దేశ పౌరులంతా వారితో శాంతి చర్చలు జరపాలని కోరుతుంటే మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ, భారతీయులను చంపిన వారితో శాంతి చర్చలకు సిద్ధమైన ప్రధాని మోదీ, భారతీయులైన మావోయిస్టులతో చర్చలకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో చర్చలు ప్రారంభించాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు స్వామి, హరినాథ్, వెంకట్ పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో ఆరుగురు అదనపు డీసీపీల బదిలీ

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు అదనపు డీసీపీలు బదిలీ అయ్యారు. మాదాపూర్ అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేస్తున్న ఎస్.జయరాం టీజీఐసీసీసీలో అడిషనల్ ఎస్పీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో కొత్తగా పదోన్నతిపై ఎన్.ఉదయ్ రెడ్డి వచ్చారు. మేడ్చల్ ఎస్‌బీ విభాగం అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న మహ్మద్ ఫజల్ ఉర్ రెహ్మాన్ హైదరాబాద్ సీఐడీ విభాగం అడిషనల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ అడిషనల్ డీసీపీగా ఎ.విశ్వప్రసాద్ రాగా, శంషాబాద్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై కె.పూర్ణచందర్, సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై జి.హనుమంతరావు, రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై కొమ్మెర శ్రీనివాస రావును నియమిస్తూ హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడు?

- నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో నిలిచిపోతున్న వాహనాలు
- ముఖ్యకూడళ్లలో మరీ దారుణం
- దీనికి తోడు ర్యాష్ డ్రైవింగ్

షాపూర్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో అని వాహనదారులు, పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ రోజు రోజుకూ పెరుగుతున్న వాహనాలు, జనాభా నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య పునరావృతమవుతూనే ఉంది.

- నియోజకవర్గ పరిధిలోని పలు కూడళ్లలో ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో రోడ్లపైనే చాలా సమయం వృథా అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించినా, ముఖ్య కూడళ్లలో సిగ్నల్ ఏర్పాటు చేసినా ట్రాఫిక్ సమస్య మాత్రం అధిగమించలేకపోతున్నారు. కొన్ని కూడళ్లలో సిగ్నల్స్ పని చేయకపోవడం, మరికొన్ని చోట్ల అవసరం ఉన్నా సిగ్నల్స్ ఏర్పాటు చేయకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.



గాజులరామారం రోడ్డులో ట్రాఫిక్ జామ్

ఆ సమయంలోనే ఎక్కువ అవస్థలు

ముఖ్యంగా బాలానగర్, నర్సాపూర్ ప్రధాన రహదారిలోని ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్, గాజులరామారం చౌరస్తా, జీడిమెట్ల బస్సుడిపో, సూరారం, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవికాక సుచిత్ర, గాజులరామారం, దూలపల్లిరోడ్డు, ఇండస్ట్రియల్ ఏరియాల్లో ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో కంపెనీలకు వెళ్లే కార్మికులు, స్కూల్ బస్సులు, ఉద్యోగాలకు వెళ్లే వారి వాహనాలతో రోడ్లు బిజీగా మారి ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. సాయంత్రం వేళ కార్మికులు, ఉద్యోగులు ఇళ్లకు తిరిగి వచ్చే సమయంలోనూ, మధ్యాహ్నం షిఫ్టులు తిరిగి వచ్చేవారితో వెళ్లే పరిశ్రమల బస్సులు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతో ముఖ్యకూడళ్లలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి.

ఫ్లైఓవర్, మెట్రో రావాలి

కుత్బుల్లాపూర్‌లో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు అవసరమైన చోట ఫ్లైఓవర్‌లు, మెట్రో రైలు మార్గం రావాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ జరిగేందుకు సమయం పడుతుంది కాబట్టి, ట్రాఫిక్ సమస్యను తీర్చేందుకు తక్షణం అవసరమైన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో పాటు ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి. ట్రాఫిక్ జామ్ అయ్యే కూడళ్లలో అదనంగా సిబ్బందిని ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్‌ను నిలువరించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

నిబంధనలు పాటించకపోవడంతోనే..



ట్రాఫిక్ పోలీసులు లేనిచో అడ్డదిడ్డంగా వాహనాలను నడపడం, రాష్ డ్రైవింగ్, రాంగ్‌రూట్‌లో రావడం వంటివి చేస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. వీరిని కంట్రోల్ చేయకపోవడంతోనే గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతోంది. గాజులరామారం ప్రధాన రహదారిలోని ఖాజాపాన్ షాప్ చౌరస్తాలో నిత్యం ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఇక్కడ పోలీస్ సిబ్బంది లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా తమ వాహనాలను నడుపుతున్నారు. - అన్వర్, రోడామిస్త్రీనగర్

సిబ్బందిని నియమించాలి



ట్రాఫిక్ జామ్ అవుతున్న ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్‌ను అదుపు చేసేందుకు అదనంగా సిబ్బందిని నియమించాలి. ఉదయం, సాయంత్రం, మధ్యాహ్నం వేళల్లో ముఖ్యమైన కూడళ్లలో సిబ్బందిని ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు. దీంతో రోడ్డు ప్రమాదాలతో పాటు పాదచారులకు ఇబ్బందులను తొలగించే అవకాశం ఉంటుంది. - సాగర్, జయశంకర్‌కాలనీ



జీడిమెట్ల బస్‌డిపో చౌరస్తాలో ట్రాఫిక్



సూరారం చౌరస్తాలో అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు

ఘనంగా హనుమాన్ జయంతి

పేట్‌బషీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్, గాజులరామారం జంటసర్కిళ్ల పరిధిలోని ఆలయాల్లో హనుమాన్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆంజనేయ ఆలయాల్లో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు, వివిధ పార్టీల నాయకులు పూజల్లో పాల్గొని ఆంజనేయ స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.



వేంకటేశ్వరనగర్‌లో పూజల్లో పాల్గొన్న బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి తదితరులు



కుత్బుల్లాపూర్‌లోని హనుమాన్ గుడిలో పూజల్లో పాల్గొన్న ఉమ్మడి రంగారెడ్డిజిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్‌గౌడ్ తదితరులు



ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ సెక్రటరీ గుమ్మడి మధుసూదన్‌రాజు, నరేందర్‌రెడ్డి తదితరులు



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను విమానంలో బెంగళూరుకు తీసుకెళ్తున్న సీఐ దంపతులు

పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

జీడిమెట్ల,మే22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సాహించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సాయం అందించాలని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, ఆయన సతీమణి లెక్చరర్ సుశీల అన్నారు. కామారెడ్డి జిల్లా బిక్కనూరు, జంగంపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులను తమ సొంత ఖర్చులతో విమానంలో బెంగళూరు పర్యటనకు తీసుకెళ్లారు. అక్కడ విశ్వేశ్వరయ్య విజ్ఞాన కేంద్రంతో పాటు అనేక ముఖ్యమైన ప్రదేశాలను విద్యార్థులకు వారు చూపించారు. తాము కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉద్యోగాలు తెచ్చుకున్నామని, సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో స్కూల్, మండల టాపర్స్ అయిన సహస్ర, స్పందన, వంశిక, సహస్ర, నౌసేన్, మహేష్‌లను ఈ పర్యటనకు ఎంపిక చేశామని సీఐ మల్లేష్ తెలిపారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- డీఈఓ విజయకుమారి

పేట్‌బషీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఐ.విజయకుమారి అన్నారు. కుత్బుల్లాపూర్ మండలంలోని జీడిమెట్ల గ్రామ పాఠశాలలో మండల స్థాయి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం జరుగుతోంది. గురువారం జిల్లా విద్యాశాఖాధికారి విజయకుమారి, మండల విద్యాధికారి జెమినీకుమారిలు ఈ శిక్షణా కేంద్రాని సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు. ఈనెల 20న ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెల 24వ తేదీ వరకు జరుగుతుందన్నారు. తెలుగు, గణితం, ఆంగ్లంతో పాటు పరిసరాల విజ్ఞానంపై పిల్లల్లో తరగతి స్థాయి సామర్థ్యాలను పాఠ్యపుస్తకం ద్వారా ఏవిధంగా సాధించాలనే దానిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. 16 మంది రిసోర్స్ పర్సన్స్ జిల్లా స్థాయిలో 214 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.



ఉపాధ్యాయుల నుద్దేశించి మాట్లాడుతున్న విజయకుమారి



రైతులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

భూమి, వాతావరణానికి అనువైన పంటలను వేయాలి

- శాస్త్రవేత్త డాక్టర్ కె. శైలజ

దుండిగల్, మే 22 (ఆంధ్రజ్యోతి) :భూమి, వాతావరణానికి అనువైన పంటలను వేయాలని శాస్త్రవేత్త డాక్టర్ కె. శైలజ అన్నారు. దుండిగల్ మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్తలు శైలజ, శ్రీలత రైతులకు భూసార పరీక్షల ఉద్దేశం, మట్టి నమూనా పరీక్షల ఆవశ్యకత, వరిలో ప్రధాన ఎరువుల వినియోగం, భూసారాన్ని కాపాడుకోవడం,సేంద్రియ ఎరువుల వాడకం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్. యాదగిరి, మాజీ రైతు బంద్ అధికారి వైఎస్ఎరెడ్డి, గ్రామ రైతులు శ్రీనివాసరావు, దుర్గేష్, బి. నాగరాజు, నరేష్, మధు, రాజేందర్ నగర్ కళాశాల పీహెచ్‌డీ విద్యార్థులు డి. కావ్య, ఎంపీఏ సాహితి పాల్గొన్నారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ సురేష్‌కుమార్

రెండేళ్ల తర్వాత చిక్కాడు!

- బాలికపై లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్టు

జీడిమెట్ల,మే22(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగికదాడికి పాల్పడి రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని బాలానగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలానగర్ జోన్ డీసీపీ కార్యాలయంలో గురువారం డీసీపీ సురేష్‌కుమార్ విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. యాప్రాల్‌కు చెందిన క్యాటరింగ్ వర్కర్ రాబిన్‌సన్ డి కార్నెల్(25) బాలానగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి 2023 ఏప్రిల్‌లో విశాఖపట్నం తీసుకువెళ్లాడు. అక్కడ ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. 29వ తేదీన నగరానికి తీసుకొచ్చి సికింద్రాబాద్‌లో వదిలి పారిపోయాడు. బాధితురాలు తల్లిదండ్రులకు జరిగిన విషయం చెప్పడంతో రాబిన్‌సన్ డి కార్నెల్‌పై బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిపై నిఘాపెట్టిన పోలీసులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి వచ్చిన నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ పి.నరేష్‌రెడ్డి, సీఐ టి.నర్సింహరాజు పాల్గొన్నారు.

వర్షం వచ్చిన ప్రతిసారీ యాతనే!

- చెరువులను తలపిస్తున్న రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

దుండిగల్, మే 22 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు బుధవారం కురిసిన వర్షానికి జలమయం అయ్యాయి. రోడ్లపై నీరు నిలిచి చెరువులను తలపించాయి. వర్షం వచ్చిన ప్రతిసారీ ప్రధాన రహదారి పక్కన మోకాలు లోతు నీరు చేరి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కారంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొద్దిపాటి వర్షం వచ్చినా జీడిమెట్ల బస్సు డిపో వద్ద, చౌరస్తా బస్టాప్ వద్ద, దుండిగల్ మున్సిపాలిటీ, గండిమైసమ్మ చౌరస్తా, మిర్చిలే-అవుట్ సమీపంలో నర్సాపూర్ ప్రధాన రహదారిలో నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు నరక యాతన అనుభవిస్తున్నారు. రోడ్డు సమాంతరంగా లేక పోవడంతోనే ఈ సమస్య వస్తోందని స్థానికులు చెప్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేసి నీరు నిలిచే ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గండిమైసమ్మ చౌరస్తా నుంచి నర్సాపూర్ వెళ్లే రోడ్డులో చెరువును తలపిస్తున్న వర్షపు నీరు

సుభాష్‌నగర్ బాపూ లేఅవుట్‌లో..



బాపూ లేఅవుట్‌లో ఇదీ పరిస్థితి

జీడిమెట్ల, మే22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలతో కుత్బుల్లాపూర్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమ యమవుతున్నాయి. నాలాలను శుభ్రం చేయించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు సరైన పద్ధతిలో ముందస్తు చర్యలు చేపట్టకపోవడం తో నాలాల్లో ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి చిన్న వర్షాలకే నీరంతా రోడ్డుపై నిలిచిపోతోంది. దీంతో కాలనీలు, బస్తీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సుభాష్‌నగర్ ప్రాంతంలోని బాపూ లేఅవుట్‌లో రోడ్లపై నీరు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో అత్యవసర సేవలు అందించాల్సిన జీహెచ్ఎంసీ అధికారులు పత్తా లేకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక స్థానికులు అయోమయానికి గురవుతున్నారు. సూరారంకాలనీ, రామిరెడ్డినగర్ ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది.

సైబరాబాద్‌లో ఆరుగురు అదనపు డీసీపీల బదిలీ

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఆరుగురు అదనపు డీసీపీలు బదిలీ అయ్యారు. మాదాపూర్ అదనపు డీసీపీ (లా అండ్ ఆర్డర్)గా పనిచేస్తున్న ఎస్.జయరాం టీజీఐసీసీసీలో అడిషనల్ ఎస్పీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో కొత్తగా పదోన్నతిపై ఎన్.ఉదయ్ రెడ్డి వచ్చారు. మేడ్చల్ ఎస్‌బీ విభాగం అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న మహ్మద్ ఫజ్లుర్ రహమాన్ హైదరాబాద్ సీఐడీ విభాగం అడిషనల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. మేడ్చల్ జోన్ ఎస్ఓటీ అడిషనల్ డీసీపీగా ఎ.విశ్వప్రసాద్ రాగా, శంషాబాద్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై కె.పూర్ణచందర్, సైబరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై జి.హనుమంతరావు, రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీగా పదోన్నతిపై కొమ్మెర శ్రీనివాస రావును నియమిస్తూ హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.



రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా నియామక పత్రాన్ని అందుకుంటున్న కరుణాకర్

జాతీయ మానవహక్కుల కమిటీ రంగారెడ్డి జిల్లా చైర్మన్ గా కరుణాకర్

ఖేల్ కాలనీ, మే 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ మానవ హక్కుల కమిటీ రంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా శేరిలింగంపల్లికి చెందిన బురుజుకింది కరుణాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ యాసిన్, రాష్ట్ర చైర్మన్ బద్దిపడగల శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. మానవ హక్కు ల పరిరక్షణ కోసం జాతీయ కమిటీ చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించడంతో పాటు హక్కుల పరిరక్షణ కోసం కృషి చేయాలని వారు సూచించారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్రి మహిపాల్, కో-కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా చైర్మన్ వినయ్ పవార్, వైస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, గోవింద్ రాథోడ్, న్యాల్కల్ మండలం చైర్మన్ బి.రాజ నర్సింలు, జహీరాబాద్ మండల చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మబండలో విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, గౌడ సంఘం నాయకులు

సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో గురువారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, రాష్ట్ర గౌడసంఘం అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్, కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ నార్నె శ్రీనివాసరావు ఆవిష్కరించారు.



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న సీపీ అవినాష్ మహంతి

జేఎన్‌టీయూ వద్ద ఫ్రీలెఫ్ట్ పనుల పరిశీలన

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీ జేఎన్‌టీయూ వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి గురువారం పరిశీలించారు. రోడ్డు విస్తరణ పనులు, కరెంటు స్తంభాల తరలింపును త్వరితగతిన పూర్తిచేయాల్సిందిగా కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీసులకు ఆయన సూచించారు. జేఎన్‌టీయూ మూలమలుపు వద్ద ఎన్నో ఏళ్లుగా ఫ్రీలెఫ్ట్ వద్ద ట్రాఫిక్ జాం ఏర్పడుతోంది. దీన్ని పరిష్కరించేందుకు జేఎన్‌యూ గోడను లోపలకు నిర్మించి, మరమ్మతులు పూర్తిచేసి త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ వీరన్న, కూకట్‌పల్లి ఏసీపీ రవికిరణ్‌రెడ్డి, ఏపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు పత్రం అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు అందజేత

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌లో నివాసం ఉంటున్న అప్పోరీ శ్రీలక్ష్మి న్యూరాలజీ సమస్యతో బాధపడుతూ నిమ్స్ హాస్పటల్‌లో చేరి చికిత్స తీసుకుంది. అనంతరం ఆస్పత్రి బిల్లుల పరిహారార్థం సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ఆమెకు మంజూరైన రూ.1లక్ష సంబంధించిన పత్రాలను గురువారం నియోజకర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



జలవాయు విహార్‌లో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న నార్నె శ్రీనివాసరావు

సీసీరోడ్డు పనుల పరిశీలన

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ జలవాయువిహార్ కాలనీలో జరుగుతున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం స్థానికంగా పర్యటించి కాలనీలో ఉన్న సమస్యలు తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలు పరిష్కరిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

మూనాళ్లకే పగుళ్లు

- బీహెచ్‌ఈఎల్ కూడలిలో డ్రెయిన్ స్లాబులు ధ్వంసం
- ఫ్లైఓవర్ నిర్మాణంలో భాగంగా పనులు
- కీలక పనుల విషయంలో నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం
- కాంట్రాక్టర్ పనితీరుపై మండిపాటు
- అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఈ పరిస్థితి అంటూ విమర్శలు

చందానగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): చందానగర్ బీహెచ్‌ఈఎల్ కూడలిలో ఇటీవల నేషనల్ హైవే అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా రోడ్డుకు ఇరువైపులా వర్షం నీరు వెళ్లేందుకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టారు. అయితే దీనిపై వేసిన స్లాబులకు పగుళ్లు వచ్చి విరిగిపోయాయి. సదరు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, సరిగా క్యూరింగ్ చేయకపోవడంతో డ్రెయిన్‌పై వేసిన స్లాబులు విరిగిపోయాయి. దావత్ టైం రెస్టారెంట్ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా, లక్కీ మోటార్ షాపు ఎదుట, కుమార్ షర్ట్స్ సమీపంలో, విజేత సూపర్ మార్కెట్ ప్రాంతాలతో పాటు మరికొన్ని చోట్ల స్లాబులు పగిలిపోవడంతో నిర్మాణ పనుల నాణ్యత గురించి స్థానికులు చర్చించుకుంటున్నారు. స్లాబ్‌లు పగిలిపోయి డ్రెయిన్‌లో పడిపోవడంతో వర్షపునీరు వెళ్లేందుకు అడ్డుగా మారింది. దీంతో నీరు నిల్వ ఉండడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలకు నిలయంగా మారింది.



కుమార్ షర్ట్స్ సమీపంలో..

ప్రమాదాలు జరిగే అవకాశం..

రోడ్డు వెంట ఎక్కడపడితే అక్కడ స్లాబ్‌లు విరిగిపోవడంతో రాత్రి వేళల్లో వాటిపై నుంచి నడిచే పాదచారులు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాలకు వెళ్లేందుకు వాహనదారులు బాక్స్ డ్రెయిన్ దాటే సమయంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు వర్షం నీరు నిల్వ ఉండడంతో అనారోగ్య సమస్యలు వచ్చే ఆస్కారం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తయిన రెండు, మూడు నెలలకే నిర్మాణాలు ధ్వంసం కావడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పదేళ్ల వరకు డ్యామేజ్ జరిగితే కాంట్రాక్టరే బాధ్యత వహించి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంటుందని పలువురు అంటున్నారు. ఈ సమయంలో సదరు కాంట్రాక్టర్ పరిధిలోనే నిర్వహణ ప్రక్రియ ఉంటుందని చెబుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం

చందానగర్ బీహెచ్‌ఈఎల్ కూడలి సమీపంలో డ్రెయిన్ స్లాబులు పగిలిపోయిన విషయం మా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పగిలిన చోట తిరిగి మరమ్మతులు చేయిస్తాం. ఎలాంటి డ్యామేజ్‌లు ఉన్నా 10 సంవత్సరాల వరకు సంబంధిత కాంట్రాక్టరే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

- రామకృష్ణ, డీఈ, జాతీయ రహదారి

నెల గడవక ముందే..

ఈ నెల 5న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా ఇక్కడ నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభమైంది. కనీసం నెల రోజులు గడవక ముందే డ్రెయిన్ స్లాబులు విరిగిపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నిర్మాణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లోపమే దీనికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ప్రజా ధనం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులను ప్రశ్నించగా పొంతన లేకుండా మాట్లాడుతున్నారు. బరువైన వాహనాలు స్లాబులపైకి ఎక్కితే పగిలిపోతాయని సమాధానమిస్తున్నారు.



చందానగర్ కుమార్ దుకాణం ఎదుట విరిగిపోయిన డ్రెయిన్ స్లాబు

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఆంజనేయస్వామికి తమలపాకుల పూజ



యాగశాలలో సుందరకాండహోమం



అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ షిరిడీసాయిబాబా ఆలయంలో పూజలు

ఖేల్‌కాలనీ, మే22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి పర్వదినం సందర్భంగా గురువారం ఆంజనేయస్వామి దేవాలయాలు, రామాలయాల్లో హనుమాన్ జయం తి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆకుపూజలు, కల్యాణాలను నిర్వహించి. విశేష హోమాలను జరిపారు. బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లో గల శ్రీ వేంకటేశ్వర-యేగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో గల అంజనేయస్వామి ఆలయంలో మూడురోజుల పాటు జరిగిన జయంతి ఉత్సవాలు స్వామివారి ఊరేగింపుతో ముగిశాయి. విశేష పంచామృతాభిషేకం, మూన్యసూక్త పంచసూక్త సహిత అష్టోత్తర కలశాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. యాగశాలలో సుందరకాండ హోమం, పూర్ణాహుతి జరగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం లక్ష తమలపాకుల అర్చన, ఒంటె వాహనంపై స్వామివారి ద్వాదశ ప్రదక్షణాలు జయంతోత్సవాలతో ఘనంగా ముగిశాయి.

ఎంఐజీ శ్రీరామాలయంలో..

భెల్ ఎంఐజీకాలనీలో గల శ్రీరామాలయంలో నిత్యపూజలతో పాటు విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి. సామూహిక సింధూరార్చన, నామార్చనలు, శ్రీసువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఎల్ఐజీకాలనీ, విద్యుత్ నగర్‌లో గల పంచముఖ ఆంజనేయస్వామి దేవాల యం, ఎంఐజీ దాసాంజనేయస్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు, అన్నసమారాధనలు నిర్వహించారు.

చందానగర్ పరిధిలో..

చందానగర్, మే22 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి వేడుకలను చందానగర్ డివిజన్ పరిధిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాలు భక్తులతో కిక్కిరిపోయాయి. పీజేఆర్‌లోని అయ్యప్ప అలయంలో ఘనంగా అంజనేయ స్వామికి ఆకు పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలోని ఆంజనేయస్వామికి భక్తులు తరలివచ్చారు.

ఘనంగా కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు



సాయిబాబా ఆలయంలో ఆశీర్వచనాలు అందుకుంటున్న కార్పొరేటర్



దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కేక్ కట్ చేయిస్తున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి భాస్కరరెడ్డి , జీఎస్ఆర్‌కాలనీ వాసులు



కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌కు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



కార్పొరేటర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఆల్విన్‌కాలనీ కాలనీ అధ్యక్షుడు కృష్ణారావు

హైదర్‌నగర్, మే22 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పలుకాలనీల్లో, కార్పొరేటర్ కార్యాలయం, ఆలయాలు, చర్చిల్లో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కార్పొరేటర్‌తో కేక్‌కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్‌నగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మియాపూర్‌లో తిరంగా ర్యాలీ

గచ్చిబౌలి మే 22 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ నుంచి మైత్రినగర్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు భోయిని మహేశ్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మియాపూర్ న్యూకాలనీ లోని శివాలయం నుంచి జాతీయ రహదారిపై గల మైత్రినగర్ కమాన్ వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.

ఫోన్ దొంగల అరెస్ట్

మియాపూర్, మే22 (ఆంధ్రజ్యోతి): ఒంటరి వ్యక్తులపై దాడి చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. డీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రంకు చెందిన ప్రదీప్ (38)మల్లాపూర్ లో నివాసం ఉంటూ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో జీఎస్ఎం మాల్ ముందు క్యాబ్ ఆపి ఫోన్ చేస్తున్నాడు. ఈ క్రమంలో షాబాజ్, సోహెల్ అనే ఇద్దరు నిందితులు కారులో ఉన్న ప్రదీప్ వద్దకు వచ్చి అతని వద్ద ఉన్న ఫోన్‌ను లాక్కుపోయారు. ఈ క్రమంలో ఘర్షణ జరిగి ప్రదీప్‌కు గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరిపి ఇద్దరు నిందితులను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చందానగర్, రాయదుర్గం ఫిలింనగర్, పోలీస్ స్టేషన్లలో వారిపై పలు దొంగతనాల కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

గచ్చిబౌలి, మే 22 (ఆంధ్రజ్యోతి): మానవ అవయాల్లో నేత్రాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని చూపును కలకాలం కాపాడుకోవాలసిన అవసరం ఉందని కొండాపూర్ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ రామకృష్ణ అన్నారు. గురువారం కొండాపూర్ పోలీస్ బెటాలియన్‌లో మేఘాఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు.

కాంగ్రెస్ కార్యాలయానికి రెండెకరాల స్థలం కేటాయించాలి

మేడ్చల్ కలెక్టర్‌కు ఆ పార్టీ నేతల వినతి



స్థలం కావాలని మేడ్చల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డితో కాంగ్రెస్ నాయకులు

ఓల్డుబోయినపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పదేండ్ల తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ మల్కాజిగిరి కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లాలోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, ఉప్పల్, మేడ్చల్ నియోజక వర్గాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలతో కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్, కూన శ్రీశైలంగౌడ్, కొలను హన్మంత్‌రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



చందానగర్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

భారత సంవిధాన్ రక్షణ కోసం కదిలిన కాంగ్రెస్ దండు

చందానగర్, మే22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా చేపట్టిన జై బాపూ, జై బీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం చందానగర్ డివిజన్‌లో శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. అహింసా పద్ధతిలో పోరాటాలు చేస్తూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేసిన మహాత్మా గాంధీ, దేశ ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం కోసం రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్‌లను బీఆర్ఎస్, బీజేపీలు అవమానపర్చడం సమంజసం కాదని అన్నారు. దీనికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో మాట్లాడిన తీరే నిదర్శనం అన్నారు. లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా మహనీయుల ఆశయాలను కాపాడడంతో పాటు దేశ ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించిన రాజ్యాంగాన్ని కాపాడడానికి ఈ కార్యక్రమంతో పాదయాత్ర చేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాల్గొన్ని రాజ్యాంగ రక్షణ కోసం కలిసి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి సమన్వయకర్త మూగల రాఘునందన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రఘుపతిరెడ్డి, విరేశంగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, రవీందర్‌రావు, నాయకులు మిర్యాల రాఘవరావు, ఉరిటి వెంకట్రావు, వివిధ డివిజన్ల పార్టీ అధ్యక్షులు, సభ్యులు పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలిలో పడకేసిన పారిశుధ్యం

- డివిజన్ పరిధిలో పేరుకుపోతున్న చెత్తకుప్పలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

రాయదుర్గం, మే 22(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉంది. ఓ వైపు పారిశుధ్య కార్మికులు, అధికారుల నిర్లక్ష్యం.. మరోవైపు ప్రజల బాధ్యతా రాహిత్యంతో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ముఖ్యంగా గోపన్‌పల్లి, ఎన్టీఆర్ నగర్, తండా, గౌలిదొడ్డి, కేశవనగర్, నానక్‌రాంగూడ, రాయదుర్గం, మధురానగర్, గచ్చిబౌలి, రాయదుర్గం ముస్లిం బస్తీ ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతూ అనారోగ్యాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు.



రాయదుర్గం ముస్లిం బస్తీలో పేరుకుపోయిన చెత్త



ఓయూ కాలనీ వెస్టిన్‌ప్లాజా రోడ్డులో చెత్తకుప్పలు

దోమల బెడదతో ఇబ్బందులు

రోజువారీగా జరగాల్సిన పారిశుధ్య పనులు జరగడం లేదని, దీంతో దోమల బెడదతో నిద్రపోలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితులు ఇలానే ఉంటే రాబోయే రోజుల్లో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను స్వచ్ఛ ఆటో కార్మికులకు ఇవ్వకుండా రోడ్ల పక్కన పడేస్తున్నారని,ప్రజలు అవగాహన కల్పించినా మార్పు రావడం లేదని పారిశుధ్య అధికారులు అంటున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ సరిగా ఉండేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అనారోగ్యం బారిన పడుతున్నాం

ఇటీవలి కాలంలో రోజుల తరబడి చెత్త నిల్వ ఉంటుంది. దీంతో దాని నుంచి వచ్చే దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. ఓ వైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో అనారోగ్యాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలి.

- అంజమ్మ, గచ్చిబౌలి మధురానగర్

చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటాం

గచ్చిబౌలి డివిజన్‌లో ఎక్కడా చెత్త నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటాం. కార్మికులు రోడ్ల వెంబడి చెత్త నిల్వలు లేకుండా చూడటంతో పాటు ఆయా ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూస్తాం. చెత్తను స్వచ్ఛ ఆటోలకు ఇచ్చేలా ప్రజలకు ఎంత అగాహన కల్పించినా ఎక్కడపడితే అక్కడ వేయడంతోనే సమస్య తలెత్తుతోంది.

- డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంహెచ్ఓ